
# నులక మంచం

- రసవిహారి



ఉగాది కథలపోటీలో ఎంపికైన కథ

కారు వేగంగా సాగిపోతోంది...

నీలాకాశపు పందిరి కింద సాయంసంధ్య వెలుగుల్లో పచ్చని పంట పొలాలు సరికొత్త కాంతులు వెదజల్లుతున్నాయి. గలగల ప్రవహించే పిల్ల కాలువలు... వాటిపై అటూ ఇటూ ఎగురుతున్న తెల్లని కొంగలు... పంట చేల గట్లపై పచ్చగడ్డి మోపులతో అక్కడక్కడ పల్లెపడుచులు... చెంగు చెంగున గెంతుతూ వారిని అనుసరిస్తూ సాగిపోయే అమాయకపు గొర్రెపిల్లలు... నిండైన పల్లె అందాలకు అద్దంపట్టే ఇలాంటి దృశ్యాలెన్నో కనుల ముందు కనిపిస్తూ వెనక్కి పరుగుతీస్తున్నాయి.

కారు వెనక సీట్లో కిటికీ ప్రక్కగా జారబడి కూర్చున్న 'సీతారామయ్య' ఆలోచనలు జరిగిపోయిన రోజుల్లోకి జారిపోతున్నాయి.

★ ★ ★

'నీలకంఠాపురం...!'

సీతారామయ్య పుట్టిన ఊరది. అరెకరం మెట్టు, ఒక గది తాటాకుల ఇల్లు, ఓ నులక మంచం ఇవే సీతారామయ్యకు అందివచ్చిన వారసత్వ ఆస్థులు. సహజంగా కష్టజీవి కావడంతో చెమటోడ్చి తన ఆస్తిని నాలుగెకరాల పల్లంవరకు పెంచాడు.

మేనత్త కూతురైన ఆదిలక్ష్మిని కట్టుకున్నాకే తన ఆస్తి పెరగడంతో ఈ అదృష్టమంతా తన భార్యదేనని చెప్పుకుంటాడు సీతారామయ్య.

ఒకే ఒక మగ సంతానం. తన కొడుకు తనలా కష్టపడకూడదని, దర్జాగా ఉద్యోగం చేయాలని, పట్టుదలతో చదివించి ఓ ఉద్యోగస్థుడ్ని చేసాడు.

ఉన్నదాంతో ఆనందంగా గడచిపోతున్న రోజులు సీతారామయ్యకు అకస్మాత్తుగా శూన్యంగా మారిపోయాయి. అనుకోకుండా బయటపడిన ఊపిరితిత్తుల రోగం భార్య ఆదిలక్ష్మిని ఆరు మాసాలు మంచాన పడేసి అట్నుంచి అటే పై లోకాలకు తీసుకెళ్లిపోయింది. ఒంటరిగా మిగిలిపోయిన సీతారామయ్యకు వయసు మరింత భారం కావడంతో ఇష్టంలేకపోయినా ఊరు విడిచి పట్నంలో ఉంటున్న ఒక్కగానొక్క కొడుకు ఇంటికి తరలి రాక తప్పలేదు.

కొడుకు 'శేఖర్'ది గవర్నమెంటుద్యోగం. 'నొప్పింపక తానొవ్వక...' అనే మనస్తత్వం. కోడలు 'సరిత' చదువుకుంది. పైగా కొడుకు కోరి చేసుకున్న పిల్ల. ఎందుకో ఆమెకు పల్లెటూరి మనుషులన్నా ఆ వాసనలన్నా కాస్త చిన్నచూపు. 'భూమ్మీద మనుగడ సాగించే ప్రతి ప్రాణీ మట్టికి ఋణపడి ఉంటుందన్న సంగతి చాలమంది లాగే ఆమెకీ తెలీదు.'

ఇక మనవలు చందు, సృజనల విషయానికొస్తే కాలంతో పరుగులు పెట్టే చదువుల పోటీలో బంధాలు, బంధుత్వాలు, ఆత్మీయతలు అనే పదాలకు అర్థాలు తెలుసుకొనేంత తీరికే లేదు ఆ చిన్నారులకు.

ఇక సీతారామయ్యకు తనకంటూ మిగిలింది చిరకాలంగా తనతోనే ఉంటున్న ఒకే ఒక తోడు 'నులక మంచం'. అలసటలో అక్కున జేర్చుకొని ఊరటనందించే అమ్మైనా... కలతల్లో కన్నీళ్లు పంచుకొని వెన్ను తట్టే నేస్తమైనా... కలిమిలోనూ, లేమిలోనూ వెన్నంటి ఉండే జీవిత భాగస్వామి అయినా ఆ నులక మంచమే.

తన శేష జీవితానికి ఓ ఆసరా... ఓ ఆలంబన... ఓ ఆధారం... అనుకున్న ఆ నులక మంచం గురించే ప్రస్తుతం సీతారామయ్య ఆలోచనలన్నీ...!

★ ★ ★

"తాతయ్యా... దిగు."

మనవడి మాటలతో యీ లోకంలోకొచ్చాడు సీతారామయ్య. చీకటి పడి ఎంతసేపయిందో తెలీదు... తానెక్కడికొచ్చాడో తెలీదు... ఇపుడెందుకు దిగుతున్నాడో తెలీదు... కొడుకు, కోడలు, మనవలతో కలసి అన్నవరంలో దైవదర్శనం చేసుకున్నాక కారెక్కి సుమారు నాలుగ్గంటలయ్యుంటుంది. అంతసేపు కారులో కూర్చోవడం సీతారామయ్యకే కాస్త ఇబ్బందిగానే ఉంది. నెమ్మదిగా కారు దిగుతూ "ఆదీ?... ఇక్కడెందుకాపారురా..." అడిగాడు మనవరాలిని.

తన భార్య ఆదిలక్ష్మి తనింట మనవరాలి రూపంలో మళ్లీ పుట్టిందని ప్రేమతో 'ఆదీ..' అని పిలుస్తాడు సీతారామయ్య.

"తాతయ్యా దా టిఫిన్ చేద్దాం" పిలిచింది సృజన.

అదో పెద్ద పెంకిటిల్లులా ఉంది. చుట్టూ భారీగా ఖాళీ జాగా... ఓ పక్క పెద్ద నీళ్ల కుండీలో పైపులోంచి పెద్ద ధారగా నీళ్లు పడుతున్నాయి. మరోపక్క పది, పన్నెండు నులకమంచాలు వేసి ఉన్నాయి. ఆ వాతావరణం చూసాక కాసేపటికి అదో హోటలని అర్థమయింది సీతారామయ్యకి.

కొడుకు, కోడలు, పిల్లలు ఓ నులక మంచమ్మీద కూర్చున్నారు.

"తాతయ్యా... దా కూర్చో...! చూసావా ఇక్కడన్నీ నీ మంచం లాంటివే" అన్నాడు మనవడు చందు.

నెమ్మదిగా ఓ నులక మంచమ్మీద కూలబడ్డాడు సీతారామయ్య. అతని ఆలోచనలు మళ్లీ తన నులక మంచం వైపు సాగుతున్నాయి.

"ఏవండీ ఈ మంచాలెంత బాగున్నాయో? కూర్చోడానికి భలే సౌకర్యంగా ఉన్నాయి కదండీ" అక్కడి మంచాల గురించి సరిత భర్తతో అంటున్న మాటలు సీతారామయ్య చెవినపడ్డాయి. గత కొద్దిరోజులుగా వేధిస్తున్న కోడలి ప్రవర్తన గుర్తుకొచ్చింది.

"ఈ ఇంట్లో పడుకోడానికి మంచాలు లేవనుకున్నారా? ఆ కుక్కిమంచమేవైనా హంసతూలికా తల్పమా? పల్లెటూరి మనుషులు... పల్లెటూరి బుద్ధులు" తనతో తెచ్చుకున్న నులక మంచం విషయమ్మై కొడుకింట్లో అడుగుపెట్టిన మొదటిరోజు కోడలితో ఎదురైన అనుభవమది. ఆ రాత్రి పిల్లల గదిలో ఓ పక్కగా తన మంచాన్ని వేసుకొని పడుకున్నాడు. విడిచి వచ్చిన సొంత ఊరితోపాటు యాదృచ్ఛికంగా- ఎన్నో ఏళ్ల క్రితం చనిపోయిన తన తల్లి గుర్తుకురావడంతో దుఃఖం పొంగుకొచ్చింది సీతారామయ్యకు.

'బహుశ అందుకేనేమో సొంత ఊరిని కన్న తల్లితో పోలుస్తారు...' అలా ఆలోచనల మధ్య తనకి తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాడు సీతారామయ్య. అలవాటు ప్రకారం చీకటి ఉంటుండగానే తెలివొచ్చేసింది సీతారామయ్యకి. ఇంట్లో ఇంకా ఎవరూ లేచినట్టు లేదు. కాసేపు అలాగే మంచమ్మీద కూర్చుని లేచి వీధి తలుపు తెరుచుకొని డాబా మీదకి వెళ్లాడు. 'వేకువ వెలుగులు పరచుకుంటున్న ఆకాశం... మసక బారుతున్న చుక్కలు...' వాటిని చూడగానే తన పరిచయస్తులు నడుమ ఉన్నట్టనిపించింది. చాలాసేపు డాబామీదే గడిపాడు సీతారామయ్య.

గదిలో పిల్లల్ని లేపడానికొచ్చిన సరిత గోడకు జారేసి ఉన్న నులక మంచాన్ని చూసింది. "ఛీ... ఛీ! యీ ముసలాయనకి ఇంకెలా చెప్పాలో!... గది అందమే పోయింది" అనుకుంటూ ఆ మంచాన్ని తీసుకెళ్లి బయట స్టోర్ రూమ్‌లో పడేసింది.

మామూలుగా రాత్రి పడుకునేందుకు గదిలోకొచ్చిన సీతారామయ్య తన మంచం కనబడక పోవడంతో గతుక్కుమన్నాడు.

"సరితమ్మా!... ఇక్కడి నా మంచం... అంటుండగా, స్టోర్‌రూమ్‌లో భద్రంగా ఉంది. అయినా మీకు చెప్పాను కదా... ఆ డొక్కు మంచం వాడొద్దని... ఎంత అసహ్యంగా ఉందదీ! రూమ్‌లో ఉన్నది 'డబల్ కాటే' కదా పిల్లలతోపాటు మీరూ పడుకోండి"అంటూ విసురుగా వెళ్లిపోయింది సరిత.

పరిస్థితులు పాత మనుషుల్లోని కొత్త మనుషుల్ని బయట పెడుతున్నాయి.

సీతారామయ్య కాసేపటికి తేరుకొని పిల్లల మంచమ్మీద ఓ పక్కగా నడుం వాల్చాడు. మెత్తని పరుపు ముళ్ళలా గుచ్చుకుంటోంది కోడలి మాటల్లా. సమయం గడుస్తోంది... గడియారం చప్పుడులా ప్రతిధ్వనిస్తోంది సీతారామయ్య గుండె చప్పుడు. గంటలు గడుస్తున్నాయి కంటిమీద కునుకు వాలడం లేదు. తనని ఒంటరిని చేసి భార్య పరలోకాలికెళ్లిపోయిన నాటి రాత్రి అనుభవించిన వేదన గుర్తొచ్చింది. ఆ తరవాత ప్రతి రాత్రీ సీతారామయ్యకు నిద్ర లేని రాత్రే.

"తాతయ్యా నువ్వేం తింటావు" మనవరాలి ప్రశ్నతో ఈ లోకానికొచ్చిన సీతారామయ్య "నాకేం వొద్దమ్మా... మీరు తినండి" అన్నాడు ముభావంగా. నిప్పుల పొయ్యిమీద కాలుతున్న గోధుమ రొట్టెల వైపు మళ్లింది చూపు. చలికాలంలో భార్య వేడి వేడిగా నిప్పులపై కాల్చి యిచ్చే జొన్న రొట్టెలు గుర్తొచ్చాయి. అప్రయత్నంగా కళ్లు చెమర్చాయి.



"నాన్నా వెళ్దాంపద" కొడుకు మాటతో కారువైపు కదిలాడు సీతారామయ్య.

* * *

రాత్రి ఒంటి గంట దాటుతోంది. పక్క మీద అసహనంగా కదులుతున్నాడు సీతారామయ్య.

"తాతయ్యా ఎప్పుడు చూసినా మేలుకొనే ఉంటావు నీకు నిద్దర రాదా?" అడిగాడు మనవడు. పాపం ఆ పిల్లాడికేం సమాధానం చెప్పగలడు. కోడలికే మరోసారి నచ్చజెప్పాలనుకున్నాడు.

మరుసటిరోజు రాత్రి...

"సరితమ్మా...! నాకు ఎన్నో ఏళ్లుగా ఆ నులక మంచం అలవాటైపోయింది. నా చిన్నప్పుడు ఏమీ తెలియని పసి వయసులో ఆ మంచమ్మీదే అమ్మ పక్కలో ఆటలాడుకున్నాను... ఊహ తెలిసాక ఆ మంచమ్మీదే జీవితం గురించి కలలుగన్నాను... పెళ్లయ్యాక మీ అత్తయ్య కాపురానికొచ్చిన దగ్గర్నుంచీ... ... ... ... " దుఃఖంతో గొంతు పెగల్లేదు సీతారామయ్యకి. "ఆ తరవాత చివరికి నేను ఏకాకిగా మారాక వేసవిలో ఆరుబయట చల్లని గాలులు పంచుతూ ఎముకలు కొరికే చలికాలంలో నిప్పుల కుంపటి వెచ్చదనాన్నందిస్తూ ప్రతి దశలోనూ నేనున్నానని ఆసరా ఇచ్చిన నా నులక మంచాన్ని దూరం చేయకమ్మా... కావాలంటే రోజూ పొద్దున లేచిన వెంటనే నేనే ఆ మంచాన్ని బయట పెట్టేస్తాను" ప్రాధేయపడ్డాడు సీతారామయ్య.

"ఏం అక్కర్లేదు చూసిన వాళ్లు 'వీళ్లంతా మెత్తని పరుపులపై పడుకొని ముసలాడ్ని కట్టి మంచమ్మీద పడుకోబెట్టారని' మమ్మల్ని అనుకోడానికా? నాకింకేం చెప్పకండి" రుస రుసలాడింది సరిత.

చేసేది లేక పిల్లల మంచమ్మీదే చారబడ్డాడు సీతారామయ్య. గుండె లోతుల్లోంచి దుఃఖం కన్నీటి రూపంలో పొంగి పొరలుతోంది... అలా ఎంత సేపో... ...!

* * *

తెల్లవారి చాలా సేపయింది.

"సరితా ఈరోజు నాన్నింకా లేవలేదా?" అడిగాడు శేఖర్.

"చీకట్నే లేచి పోతారుగా! డాబామీదున్నారేమో!"

"నేను డాబా మీంచే వొస్తున్నాను... శేఖర్ కంగారు చూసి సరిత కూడా వెదకడం మొదలుపెట్టింది. ఇల్లూ... వీధీ... పెరడూ అంతలక్కా వెదికారు.

స్టోర్ రూమ్ గొళ్లెం తీసుండడం చూసి తలుపులోనికి తోసాడు శేఖర్. తనతో తెచ్చుకున్న మంచమ్మీద ప్రశాంతంగా నిద్రపోతున్న తండ్రిని చూసాడు. నాన్నా... నాన్నా... అంటూ తట్టి లేపబోయాడు.

కానీ... అప్పటికే ఆ నులక మంచమ్మీద శాశ్వతంగా నిద్రలోకి జారిపోయాడు సీతారామయ్య.

పెద్దవాళ్లకు అన్నీ అందిస్తున్నామనుకుంటున్న ప్రతి ఒక్కరూ అసలు వారు కోరుకుంటున్నదేమిటో ఒక్క క్షణం ఆలోచించాలి. ★

---

# రింగ్‌టోన్.. మనసు చెప్పేన్..!



సెల్ ఫోన్లో ఓ వ్యక్తి ఉపయోగించే రింగ్‌టోన్‌ని బట్టి అతని మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చు. అలా అని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఓ వ్యక్తి బాహ్య వర్తనుడా (ఎక్స్‌ట్రావర్ట్) లేక అంతర్ముఖుడా (ఇంట్రావర్ట్) అనే సంగతిని రింగ్‌టోన్ సూచిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి ఒక్క రింగ్‌టోన్‌తో మీరేమిటనే సంగతి అవతలివాళ్లకు తెలిసిపోతుందన్న మాట. ఈ మధ్య ఓ బ్రిటీష్ కంపెనీ దృష్టి సెల్ ఫోన్ వినియోగదారులపై పడింది. అది జరిపిన అధ్యయనం ప్రకారం వర్తమానంలో పాపులర్ అయిన పాటల్ని ఉపయోగిస్తూ మాటిమాటికీ రింగ్‌టోన్లని మార్చే వాళ్లు సహజంగా చంచల మనస్తత్వాన్ని కలిగివుంటారు. అలాగే శాస్త్రీయ సంగీతాన్ని కోరుకునేవారు స్థిరచిత్తులై వుంటారు. ఈ అధ్యయనం బ్రిటన్‌లో జరిగినప్పటికీ మన దేశంలోని సెల్ ఫోన్ వినియోగదారులకీ అందులోని అంశాలు వర్తిస్తాయని సైకాలజిస్టులు చెబుతున్నారు. 'జనం వ్యక్తిత్వాన్ని వారు వినే సంగీతం ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది' అంటారు కోల్‌కతాకు చెందిన మానసిక నిపుణుడు అమర్‌నాథ్ మల్లిక్. 'ఇవాళ కమ్యూనికేషన్‌కీ, జీవన శైలికీ ప్రధాన ఉపకరణం సెల్ ఫోన్లు. రింగ్ టోన్ల వినియోగం వెనుకవున్న ప్రధాన కారణం తామేమిటో తెలియజెప్పాలనే ఆరాటం. మిగతావాళ్లకంటే తాము భిన్నమని చెప్పుకోవడానికి కొంతమంది యత్నిస్తుంటారు. దాంతో వాళ్ల అంతర్గత భావనలు బయటపడుతుంటాయి' అని ఆయన చెబుతారు. మనసుకి ఆహ్లాదాన్ని కలిగించే మెలోడీ గీతాల్ని వినియోగించేవాళ్లు సహజంగా చక్కని వ్యక్తిత్వంతో కూడిన మృదు స్వభావులై వుంటారని డాక్టర్ మల్లిక్ అంటారు. 'మరోవైపు, ఓ ఫోన్‌లో దాని యజమాని గొంతో లేక కుటుంబ సభ్యుల్లో ఎవరిదైనా గొంతో వినిపిస్తే వాళ్లు స్వార్థపరులని అర్థం చేసుకోవాలి. రణగొణ ధ్వనుల్నో, జంతువుల అరుపుల్నో రింగ్‌టోన్లుగా వుపయోగించేవాళ్లు అసహజ స్వభావులని గుర్తించాలి' అంటారాయన. సెల్ ఫోన్ వినియోగదారుల్లో 21 శాతం మందికి ఓ ప్రామాణిక రింగ్‌టోన్‌ని కలిగివుండటం ఇష్టం లేదని ఈ అధ్యయనంలో తేలింది. అలాంటివాళ్లు సహజంగా పిరికివాళ్లనీ, టెక్నాలజీ అంటే భయపడేవాళ్లనీ మానసికవేత్తలు అంటారు. పెద్ద శబ్దంతో వినిపించే రాక్ మ్యూజిక్‌ని రింగ్‌టోన్లుగా వాడేవాళ్లు ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి యత్నిస్తుంటారని మానసిక వైద్యులు చెబుతున్నారు. తమలోని అభద్రతాభావాన్ని పోగొట్టుకోవడానికే ఇలాంటి ఆధిక్యతాభావాన్ని వాళ్లు ప్రదర్శిస్తుంటారని వారంటారు.



-కార్తికేయ